నమస్తే తెలంగాణ

మంచిర్యాల

కుమ్రం భీం ఆసిఫాబాద్

5 ఆదివారం 25 ఆగస్టు 2024 MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD


## అంగన్‌వాడీ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి



మాట్లాడుతున్న ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఆగస్టు 24 : జిల్లా స్త్రీ, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. శనివారం ఆసిఫాబాద్ మండలం దస్నాపూర్-2 అంగన్‌వాడీ కేంద్రంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీతో కలిసి పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల మానసిక, శారీరక ఎదుగుదలను పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

## అంతిమయాత్రకు అవస్థలు

### మోకాలు లోతు నీటిలో వాగు దాటి దహన సంస్కారాలు



వాగులో నుంచి పాడెను మోసుకెళ్తున్న గ్రామస్తులు

భీమారం,ఆగస్టు 24 : మంచిర్యాల జిల్లా భీమారం మండలం ఎల్కేశ్వరం గ్రామంలో శనివారం బొమ్మ రాజుబాయి (75) అనారోగ్యంతో మృతి చెందగా, అంత్యక్రియలకు బంధువులు, కుటుంబ సభ్యులు అవస్థలు పడాల్సి వచ్చింది. వర్షాలకు సమీపంలో ఉన్న వాగులోకి వరద చేరగా, మోకాలు లోతు నీటిలో మృతదేహాన్ని ఎత్తుకొని దానిని దాటి దహన సంస్కారాలు చేయాల్సి వచ్చింది. వర్షాకాలంలో ఎవరైనా మృతి చెందితే వాగు దాటేందుకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని, సర్కారు స్పందించి వాగుపై వంతెన నిర్మించాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు. కాగా, కేసీఆర్ సర్కారులో వాగు అవతల వైకుంఠధామం నిర్మించగా, అంతలోనే ప్రభుత్వం మారడంతో దానిని ప్రారంభించలేదు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జగదీశ్

## ఉద్యోగుల సమస్యలపై పోరాటం చేస్తాం

### ఉద్యోగ సంఘాల జేఏసీ, టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు జగదీశ్

హాజీపూర్, ఆగస్టు 24 : రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటం చేస్తామని టీ ఉద్యోగ జేఏసీ, టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో సంఘ కార్యాలయంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇన్నారెడ్డి తిరుమల్ రెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పీఆర్సీ అమలు, పెండింగ్ డీఏలు, 317 జీవో రద్దు, నగదు రహిత వైద్య సేవలు, ఉపాధ్యాయులకు ఏకీకృత సర్వీసు నిబంధనల అమలు, సీపీఎస్ రద్దు, పెన్షనర్లకు డైరెక్టరేట్ ఏర్పాటుతో పాటు మరిన్ని సమస్యల పరిష్కారానికి ఉద్యమం చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి, కార్యదర్శి భూముల రామ్మోహన్, అసోసియేట్ అధ్యక్షులు శ్రీపతి బాపురావ్, పొన్న మల్లయ్య, తిరుపతి, సతీశ్‌కుమార్, శ్రావణ్, సునీత, శావప్రసాద్, మంచిర్యాల యూనిట్ అధ్యక్షుడు నాగుల గోపాల్‌జిల్లా, మంచిర్యాల యూనిట్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# పరిష్కారం చూపని దిశ

- ఆసిఫాబాద్ కలెక్టరేట్‌లో కేంద్ర పథకాలపై ఎంపీ సమీక్ష
- పలు అంశాలపై చర్చ.. సమస్యలపై స్పందించని నగేశ్
- నేషనల్ హైవేపై అప్పడే గుంతలా అంటూ మండిపాటు
- గతంలో లేని కరెంట్ కోతలు ఇప్పడెందుకని ప్రశ్నించిన ఎమ్మెల్యే హరీశ్‌బాబు
- అటవీశాఖ అనుమతులు లేక నిలిచిన రోడ్లు
- సెల్ సిగ్నల్స్ లేక పింఛన్ దారుల పాట్లు



దిశ సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే హరీశ్‌బాబు, కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

కుమ్రం భీం ఆసిఫాబాద్, ఆగస్టు 24(నమస్తే తెలంగాణ) : జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఆదిలాబాద్ ఎంపీ నగేశ్ కేంద్ర ప్రభుత్వ పథకాలు, అభివృద్ధిపై శనివారం నిర్వహించిన 'దిశ' సమావేశం సమస్యలకు పరిష్కారం చూపకుండానే ముగిసింది. కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, సిర్పూర్ ఎమ్మెల్యే హరీశ్‌బాబుతో కలిసి మధ్యాహ్నం 12 గంటల నుంచి 2.30 గంటల దాకా సమీక్ష నిర్వహించగా, అటవీ శాఖ అనుమతులు లేక నిలిచిపోయిన రోడ్లు, సెల్ సిగ్నల్స్ లేక ఆసరా పింఛన్‌దారులు పడుతున్న ఇబ్బందులు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న ఖాళీల వంటి అనేక సమస్యలను అధికారులు ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. ఆయన వాటి పరిష్కారం కోసం ఎలాంటి హామీ ఇవ్వకుండానే వెళ్లిపోయారు. జిల్లాలో అటవీ శాఖ అనుమతులు లేక 33 వంతెనలు, 31 రోడ్లు నిలిచిపోయినట్లు అధికారులు ఎంపీకి తెలిపారు. మరో 9 రోడ్ల నిర్మాణానికి కేంద్ర అటవీ శాఖ నుంచి అనుమతి వచ్చిందని, రూ. 12 కోట్లు అటవీ శాఖకు చెల్లించి ఈ పనులు చేపట్టాల్సి ఉంటుందని, ఈ నిధులు కూడా చెల్లించకపోవడంతో అనుమతులు వచ్చిన రోడ్లను సైతం



సమావేశానికి హాజరైన వివిధ శాఖల అధికారులు

నిర్మించలేకపోతున్నామని ఆర్అండ్‌బీ అధికారులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ఆయన ఎలాంటి హామీ ఇవ్వలేదు. అలాగే పీఎంజీఎస్‌వై కింద వచ్చిన 13రోడ్ల నిర్మాణాలకు కూడా క్లియరెన్స్ లేదని అధికారులు ఎంపీకి చెప్పారు. జిల్లాలోని 75 అంగన్‌వాడీకేంద్రాలకు పక్కా భవనాలు లేవని, 98 అంగన్‌వాడీ టీచర్ పోస్టులు, 271 ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయని అధికారులు తెలిపారు. పక్కా భవనాల నిర్మాణాలకు స్థలం సమస్య ఎదురవుతుందని అధికారులు ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. గిరిపోషణ్ అభియాన్ పథకాన్ని అమలు చేసేందుకు కృషి చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. జిల్లాలో సెల్ సిగ్నల్స్ లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, తిర్యాణి మండలం మంగి, మానిక్యాపూర్, గోవెన, కెరమెరి మండలం జోడేఘాట్ ప్రాంతాల్లో పింఛన్ల పంపిణీకి అవస్థలు పడుతున్నామని, తిర్యాణిలో కొత్తగా 10 సబ్‌పోస్టాఫీసుల పరిధిలో సిగ్నల్స్ లేక లబ్ధిదారులు ఏడు కిలోమీటర్లు నడిచి వచ్చి పింఛన్ తీసుకుంటున్నారని అధికారులు ఎంపీకి వివరించారు. మిషన్ భగీరథలో పనిచేసే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు అందడం లేదని ఎంపీకి విన్నవించారు.

### ఆరు నెలల్లోనే నేషనల్ హైవేపై గుంతలా?



ఆదిలాబాద్ జిల్లాలో నిర్మించిన నేషనల్ హైవేపై ఆరు నెలలైనా గడవక ముందే గుంతలు ఎందుకు పడుతున్నాయని ఆదిలాబాద్ ఎంపీ నగేశ్ అధికారులను ప్రశ్నించారు. నాసిరకం పనుల కారణంగానే హైవేపై గుంతలు ఏర్పడుతున్నాయని, నేషనల్ హైవే నిర్మాణంలో అధికారులు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. హైవేరోడ్డుకు ప్యాచ్ వర్క్‌లు చేయాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందన్నారు. కేంద్ర విద్యాలయాల ఏర్పాటుకు నివేదికలు పంపించాలని అధికారులకు సూచించారు. జిల్లాలో అమలవుతున్న ఉజ్వల, ఆర్అండ్‌బీ, ఎంపీల్యాండ్స్, డీఎంఎఫ్‌టీ, కిసాన్ సమ్మాన్ యోజన, గిరిపోషణ్, మైనింగ్, ఎన్ఆర్ఈజీఎస్ పథకాలపై ఎంపీ సమీక్షించారు. *- ఆదిలాబాద్ ఎంపీ నగేశ్*

### గతంలో లేని కరెంట్ కోతలు ఇప్పడెందుకు?



గతంలో లేని విద్యుత్ సమస్యలు ఇప్పుడు ఎందుకు వస్తున్నాయని సిర్పూర్ ఎమ్మెల్యే హరీశ్ బాబు ప్రశ్నించారు. ముఖ్యంగా గత ఆరు నెలలుగా విద్యుత్ కోతలు ఎక్కువయ్యాయని, గతంలో ఉన్న అధికార యంత్రాంగమే ఇప్పుడు కూడా పనిచేస్తుందని, మరి ఈ సమస్య ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. మళ్లీ జనరేటర్లకు పనికల్పించాల్సి వస్తుందని, రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బెజ్జూర్ పీఏసీఎస్‌లో జరిగిన అక్రమాలపై పూర్తి విచారణ చేపట్టాలని ఆయన అధికారులకు సూచించారు. వచ్చే జనవరి నుంచి రేషన్ షాపుల్లో సన్నబియ్యం ఇస్తామని ప్రకటించిందని, ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు జరుగుతున్నాయా.. రైస్‌మిల్లర్లు బియ్యాన్ని సరఫరా చేయగలుగుతారా... దీనికి సంబంధించి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని అడిగి తెలుసుకున్నారు. *- సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు*



రోడ్డుపై నాటు వేసి నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

## బురద రోడ్డుపై నాటు వేసి నిరసన

దండేపల్లి, ఆగస్టు 24 : మండలంలోని మాకులపేట గ్రామ పంచాయతీ పరిధిలోని కోయపోషగూడేనికి సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో సీపీఎం ఆధ్వర్యంలో గ్రామస్తులు శనివారం వినూత్న నిరసన తెలిపారు. బురద రోడ్డుపై నాటు వేశారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బురద రోడ్డుపై ప్రయాణించాల్సి వస్తుందని, 108 అంబులెన్స్ కూడా రాని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సీసీ రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అశోక్, రాములు, ఎల్లయ్య, రమేశ్, వెంకటేశ్, పోషన్న, సునీత, చిన్నారి, మహేశ్వరి, శ్యామల, సుజాత ఉన్నారు.

## పేదింటి బిడ్డకు పెద్దకష్టం

### ఐఐఐటీలో ఆలిండియా ర్యాంకు సాధించిన మర్సకోల కృష్ణ

- వెంటాడుతున్న ఆర్థిక ఇబ్బందులు
- చదువుకొనసాగింపునకు సాయమందించాలని వేడుకోలు
- ఐటీడీఏ చుట్టూ ప్రదక్షిణలు
- ఫోన్‌పే, గూగుల్ పే నం. 9347983284



తల్లిదండ్రులతో మర్సకోల కృష్ణ

జైనూర్, ఆగస్టు 24 : ఐఐఐటీలో ఆలిండియా ర్యాంకు సాధించిన ఆదివాసీ బిడ్డను ఆర్థిక ఇబ్బందులు వెంటాడుతున్నాయి. రాయ్‌పూర్‌లో సీటు రాగా, చదువు కొనసాగింపు ప్రశ్నార్థకంగా మారింది. దయామయులైవరైనా ఆదుకోకపోతారా అంటూ కోటి ఆశలతో ఎదురుచూస్తున్నాడు. సిర్పూర్ (యు) మండలం పుల్లారా గ్రామ పంచాయతీ పరిధిలోని తుమ్మగూడ గ్రామానికి చెందిన మర్సకోల సాకృబాయి-బాదీరావ్ దంపతుల కుమారుడు కృష్ణకు చిన్నతనం నుంచే చదువుపై ఆసక్తి. జైనూర్ మండలం పోచ్చంలొద్ది ఆశ్రమ పాఠశాలలో విద్యనభ్యసించిన ఆయన, పదో తరగతి మంచి మార్కులతో పాసయ్యాడు. ఇచ్చోడలోని ప్రభుత్వ గురుకుల కళాశాలలో ఇంటర్ పూర్తి చేశాడు. జేఈఈ మెయిన్స్ రాయగా, ఇటీవల ఫలితాలు వెలువడ్డాయి. ఆలిండియా స్థాయిలో 7456 ర్యాంకు సాధించాడు. కర్ణాటకలోని రాయ్‌పూర్ ఐఐఐటీలో ఎస్టీ కోటాలో సీటు సంపాదించాడు. బీటెక్ మ్యాథ్స్(కంప్యూటర్) నాలుగేళ్ల కోర్సు చేయాల్సి ఉంది. ట్యూషన్, హాస్టల్, సెమిస్టర్ తదితర ఫీజులు కలిపి మొత్తం రూ. 12 లక్షల దాకా అవుతుంది. కుటుంబం గడవడమే కష్టంగా ఉండగా, అంత డబ్బు కట్టేదెలా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఆర్థికసాయం కోసం ఐటీడీఏ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాడు. ప్రస్తుతం (సెప్టెంబర్ ఒకటిలోగా) రూ. 2.19 లక్షలు చెల్లించాల్సి ఉందని, దాతలెవరైనా ముందుకొచ్చి ఆదుకోవాలని వేడుకుంటున్నాడు. ఫోన్‌పే, గూగుల్ పే నం. 9347983284 (బాబాయి మాణిక్‌రావు) కసాయమందించాలని కోరుతున్నాడు.

## చివరి చూపునకు నోచుకోక..

- జ్వరంతో తల్లి మృతి
- నిమ్స్‌లో చికిత్స పొందుతున్న కుమారుడు
- అంత్యక్రియలకు హాజరుకాని సందీప్



నర్మిట మంజుల (ఫైల్)

భీమారం, ఆగస్టు 24 : తల్లి జ్వరంతో మృతి చెందగా, పురుగుల మందు తాగి దవాఖానలో చికిత్సపొందుతున్న కుమారుడు కడసారి చూపునకు నోచుకోకపోయాడు. ఈ విషాద ఘటన మంచిర్యాల జిల్లా భీమారం మండలం పోలంపల్లి గ్రామంలో జరిగింది. నర్మిట మంజుల (40) పది రోజులుగా డెంగ్యూ జ్వరంతో బాధపడుతుంది. మూడు రోజుల క్రితం వరంగల్‌లోని ఓ దవాఖానలో చేరింది. చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందింది. ఈమె చిన్న కుమారుడు నర్మిట సందీప్ హైదరాబాద్‌లో కారు డ్రైవింగ్ చేస్తుంటాడు. ఈ నెల 19న ఓ విషయమై మనస్తాపం చెంది పురుగుల మందు తాగాడు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. శనివారం స్వగ్రామంలో మంజుల అంత్యక్రియలు జరగగా, ఆమె కుమారుడు సందీప్ రాలేకపోయాడు. మృతురాలికి భర్త సురేశ్‌గౌడ్, పెద్దకుమారుడు సాయికుమార్ ఉన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న రామగుండం సీపీ శ్రీనివాస్

## ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

- రామగుండం సీపీ శ్రీనివాస్
- సీసీసీ నస్పూర్ పీఎస్ ఆకస్మిక తనిఖీ

సీసీసీ నస్పూర్, ఆగస్టు 24: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ సూచించారు. శనివారం సీసీసీ నస్పూర్ పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది పనితీరు, వారి సమస్యల గురించి అడిగితెలుసుకున్నారు. కాలనీలు, గ్రామాల్లో జరిగే నేరాలపై ఆరా తీశారు. డయల్ 100 కాల్స్‌పై వెంటనే స్పందించాలని సిబ్బందికి సూచించారు. రాత్రి వేళల్లో తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. స్టేషన్‌పరిధిలో పల్లె నిద్ర కార్యక్రమాలు నిర్వహించి, ప్రజల సమస్యలు తెలుసుకొని, సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించేలా కృషి చేయాలన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల విక్రయాలు, అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలపై నిరంతరం నిఘా పెట్టాలని సూచించారు. మహిళలు, పిల్లలు, సీనియర్ సిటిజన్లతో మర్యాదగా వ్యవహరించాలన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వెళితే సత్వరమే న్యాయం జరుగుతుందనే భావన ప్రజలకు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, రూరల్ సీఐ ఆకుల అశోక్, ఎస్ఐ సుగుణాకర్ పాల్గొన్నారు.



ఉధృతంగా ప్రవహిస్తున్న దిందా-కేతిని వాగు

## ఉప్పొంగిన దిందా-కేతిని వాగు

*శుక్రవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షానికి దిందా-కేతిని వాగు ఉప్పొంగి ప్రవహిస్తున్నది. దీంతో దిందా గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. ప్రాణహిత నదితో పాటు దిందా వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో దిందా గ్రామస్తులు ఎటూ వెళ్లలేని పరిస్థితి నెలకొంది. వాగు వద్దకు ప్రజలు వెళ్లవద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. - చింతలమానేపల్లి, ఆగస్టు 24*

## కెరమెరి అడవుల్లో పులి

### ఎట్టకేలకు నిర్ధారించిన అటవీ శాఖ అధికారులు

- ఉమ్రి గ్రామ చేనులో పాద ముద్రల గుర్తింపు
- అటవీ పల్లెల్లో భయాందోళనలు





కెరమెరి : ఉమ్రి గ్రామంలో పత్తి చేనులో పులి అడుగులను పరిశీలిస్తున్న సిబ్బంది



జన్నారం: కవ్వాల్ అడవుల్లో అధికారులు గుర్తించిన పెద్దపులి అడుగులు

కెరమెరి, ఆగస్టు 24 : కెరమెరి అడవుల్లో సంచరిస్తున్నది 'పులి'యేనని అటవీశాఖ అధికారులు ఎట్టకేలకు నిర్ధారించారు. ఉమ్రి గ్రామంలో ఓ రైతు చేనులో కనిపించిన పాదముద్రలను ఎఫ్ఆర్వో సయ్యద్ మజారొద్దీన్ పరిశీలించి పులి అడుగులుగా గుర్తించారు. ఇంతకాలం పల్లెల్లో దాడులు చేస్తున్నది పులియేనా.. లేక చిరుతనా.. తెలియక అధికారులు సతమతమయ్యారు. అడవుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినా ఎలాంటి ఆనవాళ్లు లభించలేదు. ఇటీవల దేవాపూర్ అటవీ ప్రాంతంలో మేక, పరందోలి గ్రామంలో రెండు కుక్కలపై దాడి జరగగా, తాజాగా శనివారం బోరిలాల్‌గూడలో మేకను హతమార్చింది. మధ్యాహ్నం రాజుకు చెందిన మేక పాకలో కనిపించకపోయే సరికి కొంతమంది అటవీ ప్రాంతంలో వెతికారు. అటవీప్రాంతంలో మేకను పూర్తిగా తినేసి వదిలేసిన కళేబరం కనిపించింది. ఈ ఘటనతో ఒక్కసారిగా ప్రజల్లో భయం పెరిగింది.

### కవ్వాల్‌లో పెద్దపులి పాదముద్రలు..

జన్నారం, ఆగస్టు 24 : కవ్వాల్ టైగర్ రిజర్వుడు అడవుల్లో పెద్దపులి అడుగులను అటవీశాఖ అధికారులు గుర్తించారు. బుధవారం అడవికి వెళ్లిన ఆవుదూడపై పులి దాడి చేయగా, అది ప్రాణాలతో బయటపడింది. పశువుపై దాడి చేసింది ఏ జంతువు అనే కోణంలో అటవీ అధికారులు, యానిమల్ ట్రాకర్స్ అన్వేషించారు. ఈ నేపథ్యంలో జన్నారం డివిజన్ అడవుల్లో పెద్దపులి అడుగులను గుర్తించడంతో పూర్తి స్పష్టత వచ్చింది. కవ్వాల్ అడవుల్లో పెద్దపులి ఆవాసం ఏర్పాటు చేసుకునేలా అధికారులు చర్యలు చేపట్టారు.


- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం మరియు
- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం.. మన పత్రిక..

నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..



ప్రకటనల విభాగం...

సెల్: 9182 777 571

మంచిర్యాల జిల్లా : 9182 777 676

కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679